ప్రజాశక్తి

శనివారం 27 ఏప్రిల్ 2024 పేజీలు 8

విజయనగరం

పార్వతీపురం మన్యం

పార్వతీపురంలో నామినేషన్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థుల ప్రతినిధులు

44 నామినేషన్ల తిరస్కరణ

విజయనగరం జిల్లాలో 25.. పార్వతీపురం మన్యంలో 19

ప్రజాశక్తి-విజయనగరంటౌన్/ పార్వతీపురం రూరల్

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పరిశీలన శుక్రవారం పూర్తయ్యింది. పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లాలోని ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ పత్రాలను పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాల్లో 61 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, వారిలో 11 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మన్యం జిల్లాలో అరకు పార్లమెంట్ పరిధిలో 40 మందికి 8మంది నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, 24 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. విజయనగరం పార్లమెంట్ స్థానంలో 18మంది నామినేషన్లకు ముగ్గురు అభ్యర్థులు (కలిశెట్టి రామలక్ష్మి, బెల్లాన వంశీకృష్ణ, ఇప్పిలి అప్పల నాయుడు) నామినేషన్‌లు తిరస్కరించారు. 15 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

విజయనగరం జిల్లాలోని జిల్లాలో 7 అసెంబ్లీ నియోజక వర్గాల ఎన్నికలకు సంబంధించి మొత్తం 105 నామినేషన్ లు దాఖలు కాగా ఇందులో 83 సక్రమంగా వున్నట్టు ఆయా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. రాజాంలో 12మందికి ఇద్దరు, బొబ్బిలిలో 13 మంది నామినేషన్‌లకు 4, చీపురుపల్లిలో 13మంది నామినేషన్‌లకు 5, గజపతినగరంలో 15 నామినేషన్‌లకు 2, నెల్లిమర్లలో 16 మంది నామినేషన్‌లకు 3, విజయనగరంలో 24 నామినేషన్‌లకు 4, ఎస్.కోటలో 16 నామినేషన్‌లకు 2 నామినేషన్లు తిరస్కరించినట్లు అధికారులు తెలిపారు. 80 మంది నామినేషన్లు సక్రమంగా వున్నట్టు నిర్ధారించారు.

బెడిసికొట్టిన బాబు వ్యూహం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో చాలాచోట్ల భగ్గుమన్న అసంతృప్తివాదులను చంద్రబాబు వ్యూహాత్మకంగా చల్లార్చారు. చల్లార్చడమే కాదు. తిరిగి ఎన్నికల అభ్యర్థులతో కలిసి ప్రచారం చేసే విధంగా నూరిపోశారు. ఇంతటి అపర చాణిక్యుడి వ్యూహం విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రం బెడిసికొట్టింది. పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే మీసాల గీత స్వతంత్రంగా నామినేషన్ వేయడమే కాదు. అధిష్టానం పిలుపును కూడా సున్నితంగా తిరస్కరించారు. ఇందుకు ముమ్మాటికీ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, స్థానిక టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి తండ్రి అశోక్ గజపతిరాజు వైఖరే కారణమంటూ పలువురు విశ్లేషిస్తున్నారు.

- అశోక్ వైఖరే కారణమా?
- తగ్గేదేలే అంటున్న గీత
- ముమ్మరంగా ఎన్నికల ప్రచారం
- ఎంతైనా పార్టీకి నష్టమే అంటున్న విశ్లేషకులు

చంద్రబాబుతో చర్చిస్తున్న అశోక్

ప్రచారం చేస్తున్న మీసాల గీత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అత్యధికంగా బిసిలు ఉన్న విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో గడిచిన 35 సంవత్సరాలుగా టిడిపి నుంచి ఒసి అభ్యర్థులే పోటీలో నిలిచారు. 2014 ఎన్నికల్లో అశోక్ గజపతిరాజు ఎంపీగా పోటీ చేయడంతో, అనూహ్యంగా బిసి సామాజికవర్గానికి చెందిన మీసాల గీతకు ఎమ్మెల్యేగా పోటీచేందుకు అవకాశం లభించింది. విజయం కూడా సాధించారు. 2019 ఎన్నికల్లోనూ అశోక్ మరోసారి ఎంపీగా పోటీకి దిగడంతో గీత లేదా అదే సామాజికవర్గానికి చెందిన వేరొకరికి ఎమ్మెల్యే టిక్కెట్ లభిస్తుందని చాలా మంది భావించారు. అందుకు భిన్నంగా తన కుమార్తెకు సీటు కట్టబెట్టుకోవడంలో అశోక్ సఫలీకృతులయ్యారు. ఆశాభంగానికి గురైన గీత చంద్రబాబు జోక్యంతో పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషిచేశారు. అంతకు ముందు నుంచే గీతను పక్కనెబట్టి నియోజకవర్గ రాజకీయాల్లో అశోక్ తలదూర్చడంతో ఇద్దరి మధ్య వైరం ఏర్పడింది. చివరికి పార్టీ కార్యక్రమాలు కూడా ఆమెకు తెలియకుండానే జరిగిపోతుండడంతో గీత క్రమంగా బంగ్లా రాజకీయాలకు దూరమయ్యారు. ఒకానొక దశలో పార్టీకి నష్టం జరుగుతుందని భావించిన జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు తదితరులు ఆమెతో (మిగతా..3లో)

తండ్రి పోటీ.. పిల్లల ప్రచారం 4లో

రూ.6 కోట్ల విలువైన బంగారం పట్టివేత 8లో

హక్కులను కాలరాస్తున్న పాలకులు 8లో

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి • పరిశీలకులకు ఏర్పాట్లను వివరించిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, పోలీసు పరిశీలకులు సచింద్ర పటేల్‌కు, ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక వివరించారు. ఇప్పటికే సిబ్బందికి రెండు విడతల శిక్షణ పూర్తి చేశామన్నారు. మొదటి విడత ఇవిఎంల ర్యాండమైజేషన్ పూర్తయ్యిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించామన్నారు. గిరిజన ప్రాంతంలో నాలుగు పోలింగ్ కేంద్రాలున్నాయని, అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మహిళలు, యువత, దివ్యాంగులతో మోడల్ పోలింగ్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్‌పి దీపిక మాట్లాడుతూ, జిల్లాలో పోలీసు బందోబస్తు, నిఘా బృందాలు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ఎన్నికల పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని చెప్పారు. ఎన్నికలకు సమయం తక్కువగానే ఉందని, ఏర్పాట్లు ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ల స్లిప్పులను పూర్తి వివరాలతో శతశాతం పంపిణీ చేయడం ద్వారా, పోలింగ్ శాతం పెరుగుతుందని సూచించారు. మారుమూల ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలకు సిబ్బంది చేరుకొనేందుకు అనువైన వాహనాలను సమకూర్చాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో ఇక ప్రచార కార్యక్రమాలు పెరుగుతాయని, అందువల్ల కోడ్ ఉల్లంఘనలపై దృష్టి సారించాలని సూచించారు. కోడ్ ఉల్లంఘన సంఘటనలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి కెమేరాలు, సెల్‌ఫోన్లను అనుమతించవద్దని స్పష్టం చేశారు. హోం ఓటింగ్‌లో ఓటరు రహస్యంగా ఓటువేసే అవకాశాన్ని కల్పించాలని, కంపార్ట్‌మెంట్‌లో ఓటు వేస్తున్నప్పుడు వీడియో రికార్డింగ్ చేయకూడదని చెప్పారు. పోలీసు పరిశీలకులు సచింద్ర పటేల్ మాట్లాడుతూ, శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య గొప్పదనాన్ని కాపాడాలి

ఎన్నికల రాష్ట్ర పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రజాస్వామ్యం గొప్పదనాన్ని కాపాడాలని ఎన్నికల రాష్ట్ర పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో శుక్రవారం పర్యటించిన ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహణ ఒకటే అజెండా ఉండాలని, ఏ ఇతర అజెండా ఉండరాదని స్పష్టం చేశారు. ఎన్నికలలో తప్పులు చేస్తే ఉద్యోగ జీవితంలో ఇబ్బందులు ఎదురవుతాయని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలను నిజాయితీ, విశ్వాసంతో నిర్వహించాలని ఆయన చెప్పారు. ఎక్కడా ఎటువంటి అపోహలకు తావు లేకుండా పనిచేసి జిల్లాను ఆదర్శంగా నిలపాలని ఆయన సూచించారు.

జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేంఉకు చర్యలు చేపట్టామని అన్నారు. పార్వతీపురం ఉద్యాన కళాశాలలో జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశామని, పాడేరు, రంపచోడవరంలలోను కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న (మిగతా..3లో)

సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు అబ్జర్వర్

మాయా'జలం'

• మంచినీటి పేరిట మోసం • విచ్చలవిడిగా వాటర్ ప్లాంట్లు

2లో

మాయా 'జలం'

- మంచినీటి పేరిట మోసం
- విచ్చలవిడిగా వాటర్ ప్లాంట్లు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- ఎక్కడా అనుమతుల్లేవట!

ప్రజాశక్తి -చీపురుపల్లి

మంచి నీటి పేరిట మహా మోసమే జరుగుతోంది. కొన్ని వాటర్ ప్లాంట్లలో చూస్తే కనీస నియమ నిబంధనలు పాటించడం లేదు. అడ్డగోలుగా నీటిని శుద్ధి చేసామని చెప్పి ఇష్టారీతిగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. అయినప్పటికీ అధికారులు మాత్రం మాకేంటి అని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తు న్నాయి. చీపురుపల్లి నియోజకవర్గంలో ప్యూరిఫైడ్ నీటి పేరుతో సాధారణ నీటిని సరఫరా చేస్తూ ప్రజలను మోసం చేస్తూ వారి ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. నియోజకవర్గంలో సుమారు 25 నుండి 30 వరకు ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో ప్లాంట్లు నడుస్తున్నాయి. అయితే వీటిలో ఒకటి రెండు తప్ప మిగలిన వాటర్ ప్లాంట్లకు ఎటువంటి అనుమతులూ లేకుండా లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు.

మినరల్ వాటర్ మాటున దందా

మినరల్ వాటర్ పేరుతో ప్లాంట్ల యాజమాన్యాలు నీటిని శుద్ధి చేయకుండానే 20 లీటర్ల క్యాన్లలో నింపి నీళ్లను అధిక ధరలకు విక్రయిస్తూ దందా చేస్తున్నారు. నీటి నిల్వ చేసే వాటర్ ట్యాంకలను నెలల తరబడి శుభ్రం చేయకుండా వాడటంతో నాచు పేరుకు పోయి బాక్టీరియా చేరుతోంది. అదే వాటర్‌ని ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో సీసాలు, వాటర్ ప్యాకెట్లలో నింపి

అమ్మకానికి సిద్ధంగా ఉన్న టిన్ వాటర్

మార్కెట్లోకి విడిచి పెడుతున్నారు. ఈ వాటర్‌తోనే ప్రజలు ఎండ తీవ్రత దృష్ట్యా తాగి దాహార్తిని తీర్చుకుంటున్నారు. కాగా నీటిని శుద్ధి చేసిన తరువాత ఆ నీటిలో ఎంత మేర మినరల్స్ ఉంటున్నాయి, ప్రజలకు ఎంత మేర ఆ నీరు ఆరోగ్యాన్ని రక్షిస్తుంది అనే అంశాలపై తప్పనిసరిగా ఒక టెక్నిషియన్ ప్రతీ ప్లాంటు యాజమాన్యం ఏర్పాటు చేసుకోవాలి. రోజూ నీటిని పరీక్ష చేసిన తరువాత అందులో పుష్కలంగా మినరల్స్ ఉంటేనే ఆ నీటిని వాటర్ క్యాన్లు, సీసాలు, కవర్లలో నింపి మార్కెట్‌లోనికి విడుదల చేయాలి. అవేమీ లేకుండా ఇష్టారాజ్యంగా వాటర్ ప్లాంటు యాజమాన్యాలు ప్రజలు ఏమైతే మాకేంటి అన్న చందంగా వ్యవహరిస్తూ కలుషిత వాటర్‌ని ప్రజలకు అందిస్తున్నారు. కొన్ని చోట్ల కొళాయిల ద్వారా సరఫరా అయిన వాటర్‌ని కూడా క్యాన్లు, సీసాలకు పట్టి అమ్మేస్తున్నారు. ఇదంతా చూసినా అధికారు లు మాత్రం పట్టించుకున్న దాఖలాలు కానరావడం లేదు.

చోద్యం చూస్తున్న అధికారులు

వాటర్ ప్లాంట్లు నడిపే యాజమాన్యాలు తప్పనిసరిగా ఐయస్ఐ పొందాలి. అందుకోసం కొంత మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ప్లాంటు ఏర్పాటు చేసే చోట నీటి లభ్యత, నాణ్యత, అందులో వచ్చే మినరల్స్ ఏమేర ఉన్నాయి, ప్రజలకు అది ఆరోగ్యకరమైన నీరేనా అనే అంశాలపై సంబంధిత డిపార్ట్‌మెంటు ఖచ్చితత్వంతో కూడిన సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. అంతే కాకుండా సంబంధిత ప్లాంటు ప్రతీ ఏడాది రెన్యువల్ చేసుకోవాలి. ఎప్పటికప్పుడు నీటిని తప్పనిసరిగా పరీక్ష చేయించాలి. అవేమీ లేకుండా అధికారుల అండదండలతో ఇష్టారాజ్యంగా వాటర్ ప్లాంటు యాజమాన్యాలు తమకు నచ్చిన రీతిలో నియమ నిబంధనలు పాటించకుండా వాటర్ ప్లాంట్ల పేరుతో నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ పలువురు వాపోతున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రజలకు సరఫరా చేసే ప్యూరిఫైడ్ వాటర్ పట్ల అధికారులు సంబంధిత ప్లాంట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జెఇఇ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల హవా

ప్రజాశక్తి-బొబ్బిలి

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. విశాఖపట్నంలోని నారాయణ కళాశాలలో చదువుకొని సి.హెచ్.సతీష్‌కుమార్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 8వ ర్యాంకు, ఒబిసి కేటగిరిలో 2వ ర్యాంకు సాధిం చాడు. విశాఖపట్నంలోని నారాయణ బ్రాంచిలో చదువుతున్న బొబ్బిలి, సాలూరు పరిసర ప్రాంతాలకు చెందిన డి.రేవంత్ ఈశ్వర్ ఓపెన్ కేటగిరీలో 1414వ ర్యాంకు, ఒబిసి కేటగిరిలో 26వ ర్యాంకు, బి.మనోజ్ కుమార్ ఓపెన్‌లో 1459వ ర్యాంకు, ఒబిసి కేటగిరిలో 258వ ర్యాంకు, డి.పుష్పమిత్ర ఓపెన్‌లో 5024వ ర్యాంకు, ఒబిసి కేటగిరిలో

రేవంత్ ఈశ్వర్ | బి.మనోజ్‌కుమార్ | డి. పుష్పమిత్ర, | పూర్ణచంద్ర | బి. కావ్య | ఎం. నిఖిల్

103వ ర్యాంకు, వి.పూర్ణ చంద్ర ఓపెన్‌లో 6716వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 1417వ ర్యాంకు, బి.కావ్య ఓపెన్‌లో 7822వ ర్యాంకు, ఒబిసి కేటగిరిలో 1684వ ర్యాంకు, ఎం.నిఖిల్ ఓపెన్‌లో 9206వ ర్యాంకు, ఒబిసి కేటగిరిలో 1296వ ర్యాంకు సాధించారు. జెఇఇ మెయిన్స్‌లో సత్తాచాటిన విద్యార్థులను నార్త్ కోస్టల్ డీన్, డిజిఎం డి.హనుమంతరావు, బొబ్బిలి జోన్ ఎజిఎం ఎస్.సతీష్‌కుమార్ అభినందించారు. జిల్లా వ్యాప్తంగా నారాయణ కళాశాల విద్యార్థులు ఎన్నో విజ యాలు సాధించుకుంటూ వచ్చారని తెలిపారు.

రాక్షస పాలనను తరిమికొట్టాలి : కళా

ప్రజాశక్తి - గుర్ల

రాష్ట్రంలో రాక్షస పాలనను తరిమి కొట్టాలంటే సైకిల్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని ఎన్‌డిఎ ఉమ్మడి అభ్యర్థి కిమిడి కళా వెంకట రావు కోరారు. శుక్రవారం మండలంలో భూపాల పురం, నడుపూరు, ఆనందపురం గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భూపాలపురం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న ప్రాంతంలో పర్యటించి వేతనదారులతో ముచ్చటించారు. బడుగు బలహీన వర్గాలను రైతు లను ఆదుకునే పార్టీ టిడిపి అని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో తోటపల్లి నుంచి సాగునీరు అందిస్తే, ఈ అరాచక ప్రభుత్వం రూ.5కోట్లు నిధులు విడుదల చేయకపోవడంతో రైతులు రూ.500 కోట్ల విలువైన పంటలను నష్టపోయారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌లపై ప్రజలకు వివరించారు. అనంతరం భూపాలపురం, ఆనందపురం మాజీ సర్పంచులు వైసిపిని వీడి వారి అనుచరులతో టిడిపిలో చేరారు. వారిని కళా వెంకట రావు పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వెన్నె సన్యాసినాయుడు, టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి టి కిరణ్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వరరావు, నాగులపల్లి నారాయనారావు, గొర్లె రామునాయుడు, పిల్ల అప్పలనాయుడు, కిలారి సూర్యనారాయణ, పాల్గొన్నారు.

టిడిపి తీర్థం పుచ్చుకున్న విజయశారధరావు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన డాక్టర్ ఆర్ విజయశారధిరావు వైసిపి నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. శుక్రవారం కూటమి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావులు ఆయన నివాశంలో పార్టీ కండువా కప్పి

గుర్ల: మాట్లాడుతున్న మాజీ మంత్రి కళా వెంకటరావు

టిడిపిలోనికి ఆహ్వానించారు. గతంలో టిడిపిలో ఉన్న విజయశారధిరావు ఇటీవలే వైసిపిలో చేరారు. కాగా గద్దే బాబూరావుతో పాటు టిడిపి నాయకులు సంప్రదింపులు జరపడంతో తిరిగి టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో దన్నాన రామచంద్రుడు, రౌతు కామునాయుడు, ముల్లు రమణ, గవిడి నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సభ్యులు టిడిపిలో చేరిక

రేగిడి: మండల కేంద్రానికి చెందిన జిల్లా వ్యవసాయ సలహా మండలి మెంబర్ కిమిడి నరేంద్ర నాయుడు వైసిపిని వీడి టిడిపి లో చేరారు. ఈ మేరకు శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో రాజాం నియోజకవర్గం టిడిపి కూటమి అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైసిపి సిద్ధాంతాలు నచ్చక టిడిపిలో చేరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, మాజీ డిసిసిబి ఉపాధ్యక్షులు దూబ ధర్మారావు, నాయకులు పాలవలస రామచంద్రినాయుడు, బాలి రామినాయుడు, రాజాం, వంగర మండలాల నాయకులు పాల్గొన్నారు.

మన భవితను మార్చేది ఓటే

ప్రజాశక్తి-బొబ్బిలి

మన భవితను నిర్ణయించేది ఓటేనని, ప్రతి ఓటర్ తప్పనిసరిగా ఓటు వేయాలని బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బస్‌కాంప్లెక్స్‌లో ఓటరు చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భ ంగా రాజు మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకుండా మంచి భవిష్యత్ గురించి ఎలా ఊహించగలమన్నారు. ఓటు వేయడం గౌరవంతో కూడిన కర్తవ్యంగా ప్రతి ఓటర్ భావించాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కోశాధికారి శ్రీనివాసన్, కార్యదర్శి శ్రీహరి, సెక్రటరీ ప్రవీణ్ కుమార్, యువత పాల్గొన్నారు.

కాలువలు నిర్మించండి

ప్రజాశక్తి-బొబ్బిలి

నాయుడుకాలనీలో మురుగునీటి కాలువలు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మిని స్థానికులు కోరారు. నాయుడుకాలనీ, ఇందిరమ్మకాలనీలో శుక్రవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. నాయుడుకాలనీలో మురుగునీరు బయటకు వెళ్లేలా కాలువలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. మురుగునీటి కాలువల నిర్మాణానికి కమిషనర్ హామీ ఇచ్చారు. ఖాళీ స్థలాలు, రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే జరిమానా విధించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు.

1న బొబ్బిలిలో సిఎం సభ

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలో మే ఒకటో తేదిన జరిగే సిఎం జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభను జయప్రదం చేయాలని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు కోరారు. సిఎం జగన్ సభ జయప్రదానికి వైసిపి కార్యాలయంలో శుక్రవారం వైసిపి ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు బహిరంగ సభ ప్రారంభమవుతుందని చెప్పారు. సభకు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. వైసిపితోనే అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. సమావేశంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు మావుడి శ్రీనివాసరావు, మాజీమంత్రి పెద్దింటి జగన్మోహన్ రావు, తూముల భాస్కరరావు, ఇంటి గోపాలరావు, పాల్గొన్నారు.

తీర ప్రాంతంలో కవాతు

ప్రజాశక్తి - భోగాపురం

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకే పోలీస్ కవాతు నిర్వహిస్తున్నట్లు భోగాపురం సిఐ ఎ.రవికుమార్ అన్నారు. మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన ముక్కాం, పెద్ద కొండరాజుపాలెం గ్రామాల్లో శుక్రవారం కేంద్ర బలగాలతో పోలీస్ కవాతును నిర్వహించారు. ఎన్నికల్లో ఎటువంటి వివాదాలూ లేకుండా ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు పూర్తి భద్రత ను ఎన్నికల్లో కల్పిస్తామన్నారు. వివాదాల్లోకి పోయి కేసుల్లో ఇరుక్కోవద్దని అన్నారు.

ఐఆర్ఎస్ఎ పరిశీలకుడి పర్యటన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలో ఐఆర్ఎస్ అండ్ ఎక్సెండిట్యూర్ పరిశీలకుడు ఆకాశ్‌దీప్ శుక్రవారం పర్యటించారు. దేవి జంక్షన్‌లో స్టాటిక్ సర్వేలెన్స్ బృందాన్ని సందర్శించారు. రికార్డు లను పరిశీలించి, మరిన్ని వాహనాలను తనిఖీ చేయాలని సిబ్బం దిని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కిరణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

అరిగిపాలెంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని అరిగిపాలెం గ్రామంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను, రోడ్లపై చెత్తను తొలగించారు. ఈ చెత్తను సంపద తయారీ కేంద్రానికి పంపించారు. కాలువలకు ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ చల్లి, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకున్నారు. ఈ పనులను సర్పంచ్ డి.లక్ష్మి పర్యవేక్షించారు.

'ఒక్క అవకాశమంటూ నట్టేట ముంచారు'

ప్రజాశక్తి-బాడంగి

ఎన్నికల ముందు సిఎం జగన్ ఒక్క అవకాశమంటూ చెప్పి, గద్దెనెక్కాక రాష్ట్రాన్ని నట్టేట ముంచారని బిసి సాధికార సమితి జిల్లా కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు ఆక్షేపించారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయనకు మద్దతుగా శుక్రవారం మండలంలోని కోడూరు, బ్రహ్మన్నవలస, మల్లంపేట గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి సూపర్ సిక్స్ పథకాలను వివరిం చారు. టిడిపి అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని చెప్పా రు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూలకు చేరిన బోరు

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని ఆతవ గ్రామ పరిధిలో ప్రధాన మార్గంలో జంక్షన్ వద్ద ఉన్న తాగునీటి బోరు పాడైపోయింది. దీంతో ఆ మార్గం మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం విద్యార్థులు, వేపాడ ప్రభుత్వ కార్యాలయానికి, ఎస్.కోట పనుల నిమిత్తము వచ్చి

మూలకు చేరిన బోరు ఇదే

పోయేవారు దాహార్తిని తీర్చడానికి ఈ బోరు ఉపయోగపడేది. అలాంటి బోరు మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదు. పక్కనే మరోబోరు తీసినా, అందులో నీరు సరిగా రావడం లేదు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి దృష్టికి తీసుకెళ్లగా, కొత్తగా తీసిన బోరు నుంచి నీరు సక్రమంగా వస్తున్నది, లేనిది పరిశీలిస్తామని చెప్పారు. నీరు రాకుంటే పాత బోరు బాగు చేస్తామని తెలిపారు.

పలువురి నామినేషన్లు తిరస్కరణ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

అరకు ఎస్‌టి పార్లమెంటరీ నియోజకవర్గానికి ఈనెల 18 నుంచి 25 వరకు దాఖలైన 32 నామినేషన్ సెట్లలో 8 తిరస్కరణకు గురైనట్లు ఎన్నికల అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 వరకు ఉపసంహరణలకు గడువు ఉన్నందున ఆ కార్యక్రమం అనంతరం పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించనున్నట్టు తెలిపారు.

రెండు నామినేషన్లు తిరస్కరణ

సాలూరు : నామినేషన్ల ప్రక్రియలో భాగంగా శుక్రవారం పరిశీలన కార్యక్రమం జరిగింది. ఆర్వో సి.విష్ణు చరణ్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో 17 నామినేషన్లు దాఖలు కాగా, రెండు తిరస్కరణకు గురయ్యాయి. టిడిపి అభ్యర్థి సంధ్యారాణి కుమారుడు పృధ్వీ, వైసిపి అభ్యర్థి రాజన్నదొర సోదరుడు పీడిక సుదర్శనరావు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 15 నామినేషన్లు సక్రమంగానే ఉన్నట్లు ఆర్వో విష్ణు చరణ్ తెలిపారు.

పార్వతీపురంలో నాలుగు నామినేషన్లు తిరస్కరణ

పార్వతీపురం రూరల్ : పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గానికి 17 సెట్ల నామినేషన్ దాఖలు కాగా, అందులో నాలుగు నామినేషన్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.హేమలత శుక్రవారం ప్రకటించారు. వైసిపి, టిడిపి, కాంగ్రెస్ పార్టీలకు డమ్మీలుగా వేసిన ఎ.రవికుమార్, కె.అనూష, బి.జ్ఞానానందంతో పాటు టిడిపి అభ్యర్థి బోనాల విజయచంద్ర వేసిన రెండు సెట్లు నామినేషన్లలో ఒక సెట్టు తిరస్కరణ గురైనట్లు తెలిపారు. ఉపసంహరణకు ఈనెల 29 వరకు గడువు ఉండడంతో ఆ కార్యక్రమం తర్వాత ఆఖరి ఫైనల్ జాబితా అభ్యర్థులను ప్రకటన చేయడం జరుగుతుందని తెలిపారు.

16 నామినేషన్లు అనుమతి

కురుపాం : కురుపాం నియోజకర్గంలోని 19 నామినేషన్లకు శుక్రవారం పరిశీలన జరగ్గా అందులో 16 నామినేషన్లు అనుమతించబడి, మిగిలిన 3 నామినేషన్లు తిరస్కరించబడ్డాయని కురుపాం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు.

2నామినేషన్లు తిరస్కరణ

సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలో 12 నామినేషన్లు దాఖలు కాగా, వీటిలో రెండు నామినేషన్లు తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి శబరన్ బన్సల్ తెలిపారు. తిరస్కరించిన వాటిలో వైసిపి డమ్మీ ఉల్లిభద్ర లక్ష్మి కాంగ్రెస్ డమ్మీ కూరంగి కృష్ణారావు నామినేషన్లు తిస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

చీపురుపల్లి లో 5 నామినేషన్లు తిరస్కరణ

చీపురుపల్లి : చీపురుపల్లి అసెంబ్లీకి ఎమ్మెల్యే అభ్యర్థులుగా 13 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అయితే స్క్రూటినీ అనంతరం ఎనిమిది మంది పోటీలో ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఐదుగురి నామినేషన్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు.

నెల్లిమర్లలో 3 నామినేషన్లు తిరస్కరణ

నెల్లిమర్ల: నెల్లిమర్ల అసెంబ్లీ స్థానానికి 13 నామినేషన్లు అర్హత సాధించగా 3 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని ఆర్ఒ ఎం. నూకరాజు తెలిపారు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ఎం.నూక రాజు, ఎఆర్ఒ డి.ధర్మరాజు ఆయా పార్టీల అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో వైసిపి, జనసేన, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, బిఎస్‌పి, సమాజ్ వాది పార్టీ, రీ ఫార్మ్స్ ఆఫ్ ఇండియా, జై భీంరావు భారత్ పార్టీ, అఖిల భారత జన సంఘ్ పార్టీ, జతీయ జనసేన పార్టీ, నవ రంగ్ కాంగ్రెస్ పార్టీ, ముగ్గురు ఇండిపెండెంట్ అభ్యర్థులు అర్హత పొందారు. వైసిపి, కాంగ్రెస్ పార్టీ, సమాజ్ వాదీ పార్టీ నామినేషన్లు వివిధ కారణాలతో తిరష్కరణకు గురయ్యాయి.

బొబ్బిలిలో 12 నామినేషన్లు తిరస్కరణ

బొబ్బిలి : బొబ్బిలి నియోజకవర్గంలో 12 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు 27 నామినేషన్లు దాఖలు చేశారు. ఆర్‌డిఒ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ, ఇతర ఎన్నికల సిబ్బంది.. అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. 15 నామినేషన్లను ఆమోదించి, 12 నామినేషన్లను తిరస్కరించారు. టిడిపి అభ్యర్థి బేబినాయన, వైసిపి అభ్యర్థి శంబంగి వెంకట చినప్పలనాయుడు, కాంగ్రెస్ అభ్యర్థి మరిపి విద్యాసాగర్, తదితరుల నామినేషన్లను ఆర్ఒ సాయిశ్రీ ఆమోదించారు.

సాలూరులో నామినేషన్ల పరిశీలిస్తున్న ఆర్ఒ విష్ణుచరణ్

శృంగవరపుకోటలో 2 నామినేషన్లు తిరస్కరణ

శృంగవరపుకోట : శృంగవరపుకోట అసెంబ్లీ నియోజకవర్గానికి 16 మంది అభ్యర్థులు 26 నామినేషన్లు దాఖలు చేశారు. అందులో రెండు నామినేషన్లను తిరస్కరించినట్లు ఇఆర్ఒ మురళీకృష్ణ తెలిపారు.

2 నామినేషన్లు తిరస్కరణ

రేగిడి: రాజాం తహాశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. 12 నామినేషన్లకు రెండు నామినేషన్లు తిరస్కరించారు. టిడిపి తరపున మాజీ మంత్రి కొండ్రు మురళీమోహన్‌తో పాటు అతని సతీమణి నామినేషన్ వేశారు. వైసిపి తరపున రాజేష్, అతని సతీమణి నామినేషన్ దాఖలు చేశారు. ఈ రెండు నామినేషన్లను డిమ్మీగా గుర్తించి తిరష్కరించినట్లు ఆర్ఒ జోసెఫ్ తెలిపారు.

గజపతినగరం బరిలో 13 మంది

గజపతినగరం: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ పరిశీలన అనంతరం గజపతినగరం బరిలో 13 మంది పోటీ పడనున్నట్లు అధికారులు వెల్లడించారు. కొండపల్లి లక్ష్మీ సింధు, బొత్స దేవి అనురాధ నామినేషన్లు తిరస్కరించామని ఆర్ఒ ఎన్.సూర్యకళ తెలిపారు.

నేరాలు ఘోరాలు

అగ్ని ప్రమాదంలో షాపులు దగ్ధం

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై మీద పక్షి పడడంతో నిప్పు రవ్వలు చెలరేగడంతో పక్కనే ఉన్న రాంబాబు, సత్యనారాయణ, లక్ష్మికి చెందిన మూడు ట్రాన్స్‌పోర్ట్ షాపులు దగ్ధమయ్యాయి. ఈ షాపుల్లో ఇంజిన్ ఆయిల్‌లు, టైర్లు, ఫర్నీచర్ కాలిపోయాయి. సుమారు రూ.రెండు లక్షల 50వేలు నష్టం జరిగినట్టు తెలుస్తుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు వెంటనే సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకున్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్ పేట, కేదారిపురం ప్రధాన రహదారి పిటిజి డౌన్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. గుమ్మలక్ష్మీపురం గ్రామం కొండవీదికి చెందిన బి వెంకటరావు అతని సోదరుడు సురేష్ పని నిమిత్తం జెకెపాడు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వెంకటరావుకు కాలు విరిగిపోగా, సురేష్ స్వల్పంగా గాయపడ్డాడు. వీరిని గుమ్మలక్ష్మీపురం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కవిరిపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడినట్లు ఎస్ఐ పి నరసింహమూర్తి తెలిపారు. ఎదురెదురుగా వస్తున్న లగేజ్ వ్యాన్ ఆటో ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. కవిరిపల్లి గ్రామానికి చెందిన జీ విశ్వనాథం (65) ఈ ప్రమాదంలో గాయపడ్డాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బెడిసికొట్టిన బాబు వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

చర్చలు జరిపి 'అంతా కలిసి పనిచేద్దాం, మీరు ఒక్కసారి అశోక్‌బాబును కూడా కలిస్తే బాగుంటుంది' అని కోరడంతో అందుకు గీత కూడా సానుకూలంగా స్పందించారు. తీర విషయం రాజుగారి చెవిలో పడేసరికి 'ఎవరికీ మనం అపాయింట్‌మెంట్లు ఇవ్వక్కర్లేదు కదూ' అంటూ మరోసారి గీతకు అడ్డుకట్టవేసినంత పని చేశారు. దీనికితోడు పార్టీ కార్యాలయం కూడా అశోక్ ఇల్లే కావడం వల్ల, గీత అనివార్యంగా ప్రత్యామ్నాయ కార్యాలయం ఏర్పాటు చేసుకుని పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. తాజాగా ఎన్నికల్లోనూ ఆమెకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం, చంద్రబాబు ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకోక పోవడంతో గీత స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ వేశారు. దీంతో, చంద్రబాబు ఇటీవల చేపట్టిన జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా విజయనగరంలో గీత, గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు, చీపురుపల్లిలో కిమిడి నాగార్జునలను, భోగాపురం కర్రోతు సత్యనారాయణను బుజ్జగించేందుకు ప్రయత్నాలు చేశారు. అనుకున్నట్టు అందర్నీ ఒప్పించి పార్టీ ప్రచారంలో పాల్గొనే విధంగా చేసి వైసిపి అభ్యర్థుల ఆశలను తలకిందులు చేశారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీకి జరగాల్సిన నష్టాన్ని తగ్గించారనడంలో సందేహం లేదు. కానీ, విజయనగరంలో మాత్రం ఆయన వ్యూహ్యం బెడిసి కొట్టింది. తొలి రోజు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, రెండో రోజు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెంనాయుడుతో పిలిపించినప్పటికీ గీత వెళ్లేందుకు ససేమిరా నిరాకరించారు. ఇందుకు కారణం లేకపోలేదు. స్థానికంగా అశోక్ ఆమెను ఇప్పటికీ కలుపుకోవడం లేదు. పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం ఆమెకు చేరడం లేదు. పైగా అశోక్ ఇల్లే టిడిపి కార్యాలయం. ఇన్ని ఇబ్బందుల మధ్య ఆయన ఇంటికి వెళ్లి అవమాన పడే కన్నా పార్టీలో కొనసాగుతూ స్వతంత్ర్యంగా వ్యవహరించడం మేలని భావించారు. ఇంత జరిగినా అశోక్‌ని ప్రశ్నించకుండా తనను మాత్రం కలిసి పనిచేయాలని చెప్తే ఎలా సాధ్యమౌతుందన్నది ఆమె అంతరంగగాఉంది. బహుశా ఈ కారణంతోనే ఇటీవల జిల్లాకు వచ్చిన చంద్రబాబు పిలిచినప్పటికీ ఆమె కలవలేదు. దీంతో, టిడిపిలోని బిసి ఓట్లు చీలే ప్రమాదం లేకపోలేదు. దీనికితోడు నియోజకవర్గంలో దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఆమె అనుచర గణం ఉంది. కుటుంబం బలమూ ఉంది. ఈనేపథ్యంలో ఆమెకు ఎన్ని ఓట్లు వెళ్లినా ఆ మేరకు టిడిపికి నష్టమేనని పలువురు విశ్లేషిస్తున్నారు. అదే జరిగితే టిడిపి చేసుకున్న స్వయం కృపరాధమేనని కూడా చర్చనడుస్తోంది. సొంతపార్టీ అశోక్ గజపతిరాజుకు ఇప్పటి వరకు వ్యతిరేకంగా ఎవరూ లేరని, తొలిసారిగా గీత ఆయన వైఖరిని విభేదించి రెబల్ అభ్యర్థిగా పోటీచేస్తున్నారని జనం చర్చించు కుంటున్నారు.

ప్రజాస్వామ్య గొప్పదనాన్ని కాపాడాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల వివిధ బృందాలు, కంట్రోల్ రూం పని విధానాన్ని వివరించారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ పోలీసు శాఖ పరంగా చేపట్టిన చర్యలను వివరించారు. సమావేశంలో అదనపు డిజిపి డా శంక బ్రత బాగ్చి, పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు ప్రమోద్ కుమార్ మెహర్డ , పార్లమెంటరీ నియోజకవర్గ పోలీసు పరిశీలకులు నయీం ముస్తఫా మన్సూరి , విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని,, జెసి ఎస్ ఎస్ శోబిక, ఎఎస్‌పిలు డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, సునీల్ షరోన్, పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు, ఎస్‌డిసి ఆర్ వి సూర్యనారాయణ, సిఐలు పాల్గొన్నారు.

ఆరేళ్లుగా 'మురుగు'తున్న నీటిశుద్ధి ప్లాంట్

నిర్లక్ష్యం చేసిన టిడిపి, వైసిపి పాలకులు రూ.20 కోట్లు గాలికి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ప్రజల అవసరాలకు తగిన తాగునీటి సమస్య పరిష్కారానికి నగరంలోని పెద్ద చెరువు సుందరీకరణ తో పాటు మురికి నీటిని శుభ్రం చేసి నగర వాసులకు తాగునీరు అందించే మురుగునీటి శుద్ధి కర్మాగారం టిడిపి,వైసిపి పాలకుల నిర్లక్ష్యం కారణంగా మూలకు చేరింది. 2018 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే మీసాల.గీత, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి గా ఉన్న గంటా శ్రీనివాస రావు చేతులు మీదుగా రూ.19.92కోట్లతో మురుగునీటి శుద్ధి కర్మాగారం నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. 2018 లో ప్రారంభమైన పనులు 2024నాటికి పూర్తి కావాల్సి ఉండగా, ఆరేళ్లయినా ఎక్కడి వేసిన గొంగడి అక్కడే అనే చందంగా ఉంది. ఈ ప్లాంట్ నిర్మాణానికి అమృత పథకం ఫేజ్ 2లో రూ.20 కోట్లు మంజూరు అయ్యింది. వాస్తవానికి మురుగునీటి శుద్ధి కర్మాగారం నిర్మాణం చేయాలని 20ఏళ్ల నుంచి ప్రతిపాదనలు ఉన్నా నిధులు మంజూరు చేసి,గత టిడిపి హయంలో పనులు ప్రారంబించారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు పూర్తి చేయలేకపోయారు. తర్వాత 2019 లో వచ్చిన వైసిపి పాలకులు కనీసం ఆ వైపు చూడకపోవడంతో నిర్మాణ పనులు మధ్య లోనే ఆగిపోయాయి. కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టిన ఈ పనులు పాలకుల నిర్లక్ష్యం కారణంగా ముందుకు కదలలేదు. ఇప్పటి వరకు సుమారుగా ఆరు కోట్లు విలువైన పనులు జరిగాయి. ఆ పనులు చేసిన కాంట్రాక్టర్ కి ఆరు కోట్లు బిల్లులు కూడా చెల్లించారు. మురుగునీటి శుద్ధి కర్మాగారం పూర్తయితే నగర వాసులకు 5 ఎం ఎల్ డి నీటిని అందించే అవకాశం ఉండేది.

ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తున్న శిలాఫలకం

నిర్మాణం మధ్యలో ఆగిపోయిన భవనాలు

విజయనగరం ప్రజలకు తాగునీరు అందించేందుకు అందుబాటులో నదులేవీ లేకపోవడంతో దగ్గరలో ఉన్న తాటిపూడి నుంచి, నెల్లిమర్ల పథకాలు నుంచి నీటిని రప్పిస్తున్నారు. నగరంలో సుమారుగా మూడున్నర లక్షల జనాభా ఉన్నారు.ఏడాది ఏడాదికి ఈ సంఖ్య ఎరుగుతోంది.పెరుగుతున్న జనాభా అవసరాలు దృష్ట్యా సుమారుగా 40 ఎం ఎల్ డి నీరు అవసరం ఉంది. తాడిపూడి, నెల్లిమర్ల పంప్ హౌస్‌ల నుంచి కేవలం 16 ఎం ఎల్ డి నీరు మాత్రమే వస్తుంది. వేసవి వస్తే 10ఎంఎల్‌డికి పడిపోతుంది. దీంతో గత కొన్నేళ్లగా తోటపల్లి, ఆంధ్ర ప్రాజెక్ట్‌ల నుంచి నీటిని తెస్తున్నారు. ఈ రెండు నీటి ప్రాజెక్ట్‌ల నుంచి నీటిని అందించకపోతే నగరంలో నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉండేది. ఈనేపథ్యంలోనే పెద్దచెరవుఉలో మురుగునీటి శుద్ధి కర్మాగారం నిర్మాణానికి అంకురార్పణ చేసినా దాన్ని పూర్తి చేయడం లో రెండు పాలకవర్గాలు నిర్లక్ష్యం చేశాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో సుమారు రూ. 250 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కానీ అతి పెద్ద నీటి సమస్యపై దృష్టి పెట్టకపోవడంపై ప్రజలకు తాగునీటి సమస్య తప్పలేదు.



కోలగట్ల వీరభద్రస్వామి

ఆ రెండు కుటుంబాలే

35 ఏళ్లుగా ప్రత్యర్థులు

- ఆరు సార్లు కోలగట్ల, పూసపాటి కుటుంబాల మధ్య పోటీ
- తాజాగా తలపడుతున్న కోలగట్ల, అదితి విజయలక్ష్మి

అదితి విజయలక్ష్మి గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నియోజకవర్గానిది ఘనమైన చరిత్ర. 1952 నుంచి ఎన్నికలు జరగ్గా ఎక్కువసార్లు పూసపాటి కుటుంబీకులే గెలుపొందారు. అయితే 1989 నుంచి నియోజకవర్గంలో ఒసి సామాజికతరగతికి చెందిన కోలగట్ల వీరభద్రస్వామి, పూసపాటి అశోక్ గజపతిరాజుకు చెందిన రెండు కుటుంబాలే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. వారి ఓట్లు కేవలం 5 శాతానికి మించి లేవు. కానీ 95 శాతం బడుగు, బలహీన వర్గాలను 35 ఏళ్లుగా ఈ రెండు కుటుంబాలే (ఐదేళ్లు మినహా) పాలిస్తున్నాయి. 1989 నుంచి ఇప్పటివరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కుటుంబాలే విజయనగరం నియోజకవర్గాన్ని శాసిస్తున్నాయి. 1989 లో రాజవంశీయులు అయిన పూసపాటి అశోక్ గజపతిరాజుకు ప్రత్యర్థిగా కోలగట్ల వీరభద్రస్వామి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. వరుసగా మూడు ఎన్నికల్లో అశోక్ చేతిలో ఓడిపోయిన ఆయన నాలుగోసారి 2004లో ఇండిపెండింట్‌గా పోటీ చేసి గెలుపొందారు. ఇరువురి మధ్య జరిగిన 6 అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు సార్లు అశోక్‌గజపతిరాజు గెలుపొందగా, రెండుసార్లు కోలగట్ల గెలుపొందారు. 2014 లో బిసి నాయకురాలు మీసాల గీత (టిడిపి) చేతిలో కోలగట్ల ఓటమి చెందారు. ఆ తర్వాత పూసపాటి అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి విజయలక్ష్మి గజపతిరాజుపై 2019 లో పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం 2024 లో జరుగుతున్న ఎన్నికల్లో గత ఎన్నికల ప్రత్యర్థి అదితి విజయలక్ష్మితో రెండో సారి ఎమ్మెల్యే కోలగట్ల పోటీ పడుతున్నారు.

పట్టణ సమస్యలు పరిష్కరిస్తా

ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర

సాలూరు.. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

మరోసారి అవకాశం ఇస్తే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరిస్తానని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని ఆరో వార్డులో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. గడచిన ఐదేళ్లలో పట్టణ వాసులకు ఎంతగానో ఉపయోగపడే బైపాస్ రోడ్డు నిర్మించామని చెప్పారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. కావున ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి తనకు మరోసారి గెలిపించాలని రాజన్నదొర కోరారు. ఈ ప్రచారంలో అరకు పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ డి.తనూజారాణి కూడా పాల్గొన్నారు. రాజన్నదొర, తనూజారాణి సమక్షంలో టిడిపి నాయకులు షేక్ అబ్దుల్ వైసిపిలో చేరారు. వార్డు ప్రచారం లో భాగంగా ఈశ్వరీయ బ్రహ్మ కుమారి విద్యాలయానికి వెళ్లి ధ్యానం చేశారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ, కౌన్సిలర్ జర్జాపు నీలిమ పాల్గొన్నారు.

కొత్తవలసలో వైసిపి ఇంటింటి ప్రచారం

మండలంలోని కొత్తవలస పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి శుక్రవారం ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యేగా రాజన్నదొరకు అవగాహన వుందని, ఆయన్ను గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నెమలిపిట్ట ధర్మావతి, సీనియర్ నాయకులు బొన్నాడ సీతారాం, జయసింహ, అధికారి నాయుడు పాల్గొన్నారు.

భామిని.. ఫ్యాను గుర్తు చూపిస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని : మండలంలోని నులకజోడు, సింగిడిలో ఎమ్మెల్యే వి.కళావతి ఎన్నికలు ప్రచారం నిర్వహించారు. శత శాతం మేనిఫెస్టోలో ఇచ్చిన పథకాలను పారదర్శకంగా అమలు చేసిన వైసిపిని మళ్లీ గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో పాఠశాలలు, వైద్య కేంద్రాలు, సచివాలయం వ్యవస్థ సేవలు గురించి వివరించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, నులకజోడు సర్పంచ్ కొత్తూరు ప్రసాదరావు, ఎంపిటిసి బూస బాలకృష్ణ, వైసిపి కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
శనివారం
27 ఏప్రిల్ 2024

పేరుకే నియోజకవర్గ కేంద్రం..

అభివృద్ధికి ఆమడ దూరం

- సాగు, తాగునీటికీ తప్పని కష్టాలు
- ఇదీ నెల్లిమర్ల నియోజకవర్గ దుస్థితి

నెల్లిమర్లలోని జ్యూట్ పరిశ్రమ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల పేరుకే నియోజకవర్గ కేంద్రంగా ఉంది తప్ప ఎటువంటి అభివృద్ధికీ నోచుకోలేదు. మండలం మొత్తం జనాభా సుమారు 79వేలు మంది ఉండగా వారికి తగ్గట్టు ఉపాధి అవకాశాలు లేవు. గతంలో నెల్లిమర్ల జ్యూట్ పరిశ్రమలో సుమారు 6వేల మందికి పైగా ఉపాధి పొందేవారు. 1990 వరకు జిల్లాతో బాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఉపాధి కోసం నెల్లిమర్ల జ్యూట్ మిల్లుకు వచ్చే సందర్భాలు ఉన్నాయి. కాలక్రమేణా జ్యూట్ పరిశ్రమ మారిన టెక్నాలజీతో కనుమరుగై కేవలం 1500 మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారు. ఈ ప్రాంతంలో ఒక పక్క కొండలు, గుట్టలు, చంపావతి నది, రైల్వే లైన్ ఉండటంతో మండల కేంద్రంలో కేవలం 3500ఎకరాల భూములు మాత్రమే ఉన్నాయి. ఆ భూమిలో కూడా వర్షా బావ పరిస్థితులు ఏర్పడి కొంత మంది రైతుల భూములు అమ్ముకోవడంతో రియల్ ఎస్టేట్‌లుగా మారాయి.

మూలకు చేరిన కుమిలి సాగునీటి ప్రాజెక్టు

చంపావతి నది నుంచి నీటిని మళ్లించి మండలంతో పాటు పూసపాటిరేగ మండలానికి కూడా సాగునీటిని అందించాలని ప్రారంభించిన కుమిలి సాగునీటి ప్రాజెక్టు మూలకు చేరింది. కాలువ పూర్తిగా పూడికపోవడంతో కాలువ ద్వారా సాగునీరు రైతులకు అందడం లేదు. దీంతో వర్షాలు కోసం వేచి చూడటం తప్ప రైతులు సాగునీటిపై ఆధారపడటం మానేశారు. మండల కేంద్రంలో తాగునీటి కష్టాలు కూడా పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ఉపాధి కోసం వలస

ఈ ప్రాంతంలో ప్రజలు ఉపాధి కోసం జిల్లా కేంద్రంలో భవన నిర్మాణ పనులు, షాపులకు, వందలాది మంది మహిళలు విశాఖ జిల్లా ఆనందపురం రొయ్యల పరిశ్రమలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కాగా పాలక పార్టీలు నియోజకవర్గ కేంద్రంగా గుర్తించారు గాని ఈ ప్రాంత వాసులకు ఉపాధి మార్గాలు కల్పించలేక పోయారు. గతంలో టిడిపి, కాంగ్రెస్, ప్రస్తుత వైసిపి కూడా ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశం పై పట్టించుకోలేదన్న వాదన కూడా వినిపిస్తోంది. ప్రస్తుత నెల్లిమర్ల నియోజక వర్గం గతంలో సతివాడ నియోజక వర్గంగా ఉండేది ఆ కాలంలో దివంగత మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు ఎమ్మెల్యేగా, మంత్రిగా స్థానికంగా నివాసం ఉండి నెల్లిమర్లతో బాటు నియోజకవర్గ పరిధిలోని మండలాల బాగోగులు చూసుకొనే వారు. నెల్లిమర్ల నియోజక వర్గంగా మారిన తరువాత టిడిపి, వైసిపి ఏదో మొక్కు బడిగా వచ్చి వెళ్తున్నారు గాని నియోజక వర్గ కేంద్రాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలక పార్టీలు నియోజక వర్గ కేంద్రాన్ని పట్టించుకుని అభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

పవన్ హామీతో ఆశలు

నెల్లిమర్ల జ్యూట్‌మిల్లుపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల డెంకాడ మండలం సింగవరం వద్ద జరిగిన సభలో ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు గతంలో 10వేల మంది కార్మికులకు ఉపాధి కల్పించేదని కాల క్రమేణ ఆ సంఖ్య తగ్గిందని కూటమి అధికారంలోకి రాగానే తాను జ్యూట్‌మిల్లుపై దృష్టి పెట్టి యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. పవన్ మాటలతో స్థానిక కార్మికులకు, యువతకు మళ్లీ జ్యూట్ మిల్లుపై ఆశలు చిగురించాయి.

గుర్తులు సమస్య తెచ్చిపెట్టేనా?



బకెట్ గాజుగ్లాసు

ప్రజాశక్తి -భామిని

పాలకొండ నియోజకవర్గంలో జాతీయ జనసేన పార్టీ గుర్తు బకెట్, జనసేన పార్టీ గుర్తు గాజు గ్లాస్ కావడం ఓటర్లలో చర్చనీయాంశమైంది. పాలకొండ నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా నిమ్మక జయకృష్ణ నామినేషన్ వేసి ప్రధాన పోటీదారునిగా ఉన్నారు. ఇదే సమయంలో జాతీయ జనసేన పార్టీ తరుపున పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిమ్మక కృష్ణ నామినేషన్ వేశారు. పార్టీ పేర్లు ఒకేలా ఉండడం, అభ్యర్థులు పేర్లు చిన్న తేడాతో దగ్గరగా ఉండడం, గాజు గ్లాస్, బకెట్ గుర్తుల మధ్య పెద్ద వ్యత్యాసం లేకుండా ఒకేలా ఉండడం జనసేనకు సమస్యను తెచ్చి పెడుతుందా అన్న అంశం చర్చనీయాంశంగా ఉంది. జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు గెలుపు అవకాశాలు ఎక్కువ వున్న ఈ సందర్భంలో ఈ సమస్య ఏంటా అని టిడిపి, జనసేన వర్గాలు చర్చిస్తున్నాయి. జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి నిమ్మక కృష్ణ పాలకొండ ఎంఎల్ఎ అభ్యర్థి గా ఉపసంహరించుకుంటారో లేదో చూడాలి.

నోటా 20శాతం దాటితే ఎన్నిక రద్దు

నోటా అంటే నన్ ఆఫ్ ది ఎబౌవ్ అని అర్థం. 2009లో సుప్రీంకోర్టు ఎన్నికల అభ్యర్థులను తిరస్కరించే హక్కును కల్పిస్తూ నోటాను ప్రవేశపెట్టింది. 2014వ సంవత్సరం నుంచి నోటాను ఇవిఎంలలో నమోదు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే ఇవిఎం మిషన్‌లో చివరన ఉన్న నోటా ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. పోలైన ఓట్లలో నోటాకు 20 శాతం దాటితే ఆ నియోజకవర్గంలో ఎన్నికలను రద్దు చేస్తారు. మరలా ఎన్నికలను కొంత సమయం తర్వాత నిర్వహిస్తారు. ఇప్పటి వరకూ నోటా 20 శాతం దాటిన సందర్భాలు దేశవ్యాప్తంగా ఎక్కడా చోటు చేసుకోలేదు.

- ప్రజాశక్తి, విజయనగరం డెస్క్



రెండుసార్లు ఎమ్మెల్యేగా ఆ ముగ్గురు

తలే భద్రయ్య

పిజె అమృతకుమారి

వి.కళావతి

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ నియోజక వర్గంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చరిత్ర ముగ్గురికి ఉంది. తలే భద్రయ్య 1985, 1994లో టిడిపి తరపున ఎమ్మెల్యేగా గెలవగా, పిజె అమృతకుమారి 1989లో కాంగ్రెస్ తరపున, 1999లో ఇండిపెండెంట్ గా గెలుపొందారు. అలాగే ప్రస్తుత వైసిపి అభ్యర్థి 2014, 2019 ఎన్నికల్లో వైసిపి తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ సారి గెలిస్తే పాలకొండ నియోజకవర్గ చరిత్రలో హ్యాట్రిక్ సాధించిన తొలి ఎమ్మెల్యేగా నిల్వనున్నారు.

తండ్రి పోటీ.. పిల్లల ప్రచారం

ఎన్నికల పోలింగ్ సమయం దగ్గర పడింది. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఊపందుకొంది. గెలుపు కోసం అభ్యర్థులు రాత్రి, పగలు తేడా లేకుండా శ్రమిస్తున్నారు. రోజుకు మూణ్నాలుగు ప్రాంతాలకు తక్కువ కాకుండా పర్యటిస్తున్నారు. మరోవైపు వారి వారసులు ప్రచార బరిలో దిగారు. తండ్రులకు మద్దతు కూడగడుతున్నారు. ఓటర్లను ఆకర్షించేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రచారం చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి కుమార్తె సంధ్య

తండ్రి గెలుపునకు కుమార్తెల ప్రచారం

విజయనగరం టౌన్ : వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి గెలుపునకు ఆయన కుమార్తెలు డాక్టర్ సంధ్య, డిప్యూటీ మేయర్ శ్రావణి, విస్తృత ప్రచారం చేస్తున్నారు. నగరంలోని అన్ని డివిజన్లలోనూ ఇంటింటికీ వెళ్లి తన తండ్రిని గెలిపించాలని కోరుతున్నారు. తాజాగా శుక్రవారం నగరంలోని 46వ డివిజన్ కె.ఎల్ పురం ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికలలో తనను గెలిపించాలని కోరారు. అంతకుముందు ఆయన కుమార్తె సంధ్య, అల్లుడు నాగ అభిషేక్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమెరికా నుండి నగరానికి వచ్చిన వారిరువురు కోలగట్ల గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఐదేళ్లగా నగరంలో కోలగట్ల వీరభద్ర స్వామి చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు.

బడ్డుకొండ తనయుల ప్రచారం

ప్రజాశక్తి- డెంకాడ, భోగాపురం

ప్రచారం చేస్తున్న బడ్డుకొండ అప్పలనాయుడు తనయుడు మణిదీప్

వైసిపితోనే రాష్ట్రంలో సువర్ణ పాలన సాధ్యమని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైసిపి జోనల్ ఐటి విభాగం ఇంఛార్జి బడ్డుకొండ మణిదీప్ నాయుడు అన్నారు. మండలంలోని సింగవరం, నాతవలస గ్రామాల్లో మండల వైసిపి నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తనయుడు యువజన నాయకులు ప్రదీప్ నాయుడు రావాడ గ్రామంలో వైసిపి మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రావాడబాబు, సర్పంచ్ పైడినాయుడు, నాయకులు సుందర హరీష్, వాసుబాబు, తాతయ్యలు, యర్రప్పలనారాయణ, భాను వాసుపల్లి రెయ్యుడు, బైరెడ్డి రమణ, చిన్నారావు, రాజారెడ్డి, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, డెంకాడ పిఏసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, సర్పంచ్ పిట్ట అప్పారావు, నాయకులు సంచాన కృష్ణమూర్తి, భావన, గున్నాధరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ తనయుడు సందీప్

బొత్స గెలుపు బాధ్యత.. సందీప్ భుజాన

మెరకముడిదాం : చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి బొత్స సత్యనారాయణ గెలుపు బాధ్యతను ఆయన తనయుడు, ధీర ఫౌండేషన్ అధినేత డాక్టర్ బొత్స సందీప్ భుజానకెత్తుకున్నారు. నియోజకవర్గంలో నిత్యం విస్తృతంగా పర్యటిస్తూ, ప్రజలతో మమేకమవుతున్నారు. శుక్రవారం మండలంలోని గర్భాం, పెదమంత్రిపేట, చినమంత్రిపేట, బోడందరవలస, లెంకపేట గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వేతన దారులతో మాట్లాడుతూ మీ మధ్యలో ఉంటూ, మీ బాధలను, కష్టాలను తెలుసుకొని సమస్యలను పరిష్కరించే వ్యక్తి బొత్స సత్యనారాయణను, ఎంపి అభ్యర్థి బెల్లాన చంద్ర శేఖర్‌ను ఫ్యాన్ గుర్తిపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నిత్యం మనకు అందుబాటులో ఉండి మనలను ఆదుకొనే వ్యక్తిని మాత్రమే ఎన్నికోవాలి కానీ ఎన్నికలు ముగిసిన వెంటనే తట్ట బుట్ట సర్దుకొని వెళ్లిపోయే వ్యక్తులు మనకు వద్దని చెప్పారు. నియోజకవర్గం మొత్తం బొత్స, బెల్లాన ఆధ్వర్యంలో అభివృద్ధి జరిగిన సంగతిని గుర్తు చేశారు. ఈ సంక్షేమ పథకాలు మీ ఇంటి వద్దకే రావాలంటే ముఖ్యమంత్రిగా జగన్ మోహన రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎస్‌వి రమణరాజు, పప్పల కృష్ణ మూర్తి, బూర్లె నరేష్, సింగారపు రామకృష్ణ, సత్తారు జగన్ మోహనరావు, సత్తారు శ్రీను, కందుల మల్లికార్జునరావు, చినబాబు, మండల సత్యనారాయణ, బాలి బంగారునాయుడు, బాలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాధవి విజయానికి సహకరించండి

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి- డెంకాడ

ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. జన విజయ యాత్రలో భాగంగా మండలంలోని పేడాడ, గంట్లాం, తమ్మాపురం, గొలగాం, బంగార్రాజు పేట, కొండ్రాజుపేట గ్రామ పంచాయతీలలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగ మాధవి శుక్రవారం ఇంటింటికీ ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ 5 ఏళ్లగా పంచాయతీలలో నిధులు లేక ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని, తనను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని చెప్పారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బడుకొండ అప్పలనాయుడు అభివృద్ధి ఏమైనా చేశాడా అని మహిళలని ప్రశ్నించారు? అభివృద్ధి చేయకపోగా చెరువులు, భూములు, కొండలను కబ్జాలు చేసి ఉన్నది మొత్తం దోచుకు తింటున్నాడని ఆరోపించారు. గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, నెల్లిమర్ల, డెంకాడ టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్, పల్లె భాస్కరరావు, నాయకులు పతివాడ అప్పలనారాయణ, కలిదిండి పాణిరాజు, చిట్టిబాబు, సురేష్ సంగం, జనసేన నాయకులు కంది కిరణ్, మహంతి నర్సి నాయుడు, చింతపల్లి రామ్మూర్తి, డెంకాడ కోఆర్డినేటర్ పైలా శంకర్, బత్తుల రామానాయుడు, పిన్నింటి రాజారావు, దిండి రామారావు, అట్టాడ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి మాధవితో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

నగర పంచాయతీలో వైసిపి ప్రచారం

వైసిపి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం నగర పంచాయతీ పరిధి చిక్కాల వీధిలో ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వంలో అన్నివర్గాలకు జరిగిన మేలును వివరించారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని ఫ్యాన్ గుర్తుకి ఓటు వేసి వైసిపిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబ శివ రావు , పూసపాటిరేగ ఎఎంసి ఛైర్‌పర్సన్ చిక్కాల అరుణ కుమారి, నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ కారుకొండ కృష్ణ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా సతీష్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు తదితరుల పాల్గొన్నారు.

ఇక్కడ ఆ రెండు మండలాలే కీలకం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గం లో ఎన్నికలు ఎప్పుడు వచ్చిన గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోని ఓటర్లే ఎమ్మెల్యేల గెలుపునకు కీలకంగా మారుతున్నారు. ఇక్కడ ఐదు మండలాలు ఉండగా పై రెండు మండలాల మెజార్టీతో విజయం సాధిస్తున్నారు. ఆ నమ్మకంతోనే ఏజెన్సీపై పట్టు వదలడం లేదు. గుమ్మలక్ష్మీపురం మండలంలో 16,068 మంది పురుష ఓటర్లు, 18812మంది మహిళా ఓటర్లు ,16మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. కురుపాం మండలంలో 16,825 పురుషులు, 18,054 మంది మహిళలు, 12మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. 1999 నుంచి 2019 వరకు చూస్తే శత్రుచర్ల విజయరామరాజుకు 6917, 2004 లో కోలక లక్ష్మణమూర్తి 9017, 2009లో జనార్థన థాట్రాజ్ 15,053, 2014లో పాముల పుష్ప శ్రీవాణి 19,083, 2019లో మరోసారి పాముల పుష్ప శ్రీవాణి 26,602 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు.

వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం కర్బూజా తింటున్న బేబినాయన

ఎండ నుంచి ఉపశమనం కోసమని..

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్న సమయంలో భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎన్నికల ప్రచారం చేపడుతున్న అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు వేసవి తాపానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు టిడిపి బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన కర్బూజా తిన్నారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేసుకుని బొబ్బిలి వస్తుండగా ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ వద్ద బేబినాయన, టిడిపి నాయకులు కర్బుజా పండు తింటూ ఎండల నుంచి కాస్తా ఉపశమనం పొందారు.

అనంతగిరిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్, సిపిఎం నాయకులు

పేదల నేస్తం కాంగ్రెస్సే : చంటిబాబు

ప్రజాశక్తి -భామిని

దేశంలో సామాన్యుల సంక్షేమం కోరే, ప్రజలకు అండగా నిలిచే పార్టీ కాంగ్రెస్ పార్టీనే అని పాలకొండ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సవర చంటిబాబు తెలిపారు. భామిని, అనంతగిరి, దిమ్మిడి జోల గ్రామాల్లో చంటిబాబు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరించే కరపత్రం ఇంటింటికి ఇచ్చి, కాంగ్రెస్ అభ్యర్థిగా హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిర్ల ప్రసాద్, గిరిజన సంఘం నాయకులు కొండగొర్రి భాస్కరరావు ఉన్నారు.

ఏజెన్సీలో మోస్తరు వర్షం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వేసవి ఉష్ణోగ్రతలతో ఉక్కిరి బిక్కిరవుతున్న గుమ్మ లక్ష్మీపురం ఏజెన్సీ ప్రజలకు శుక్రవారం సాయంత్రం కురిసిన మోస్తరు వర్షంతో ఉపసమనం లభించింది. మండలంలోని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో గంటపాటు వర్షం కురిసింది. ఈ వర్షంతో పాటు పిడుగులు పడడంతో ప్రజలు భయాందోళన చెందారు.

బొబ్బిలిలో గాలివాన

బొబ్బిలి : పట్టణంలో శుక్రవారం సాయంత్రం గాలులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం 4గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 4గంటల తర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడి గాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు సేద తీరారు. వర్షంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రావివలసలో దేశతల్లి గుడి ప్రతిష్ట

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని రావివలసలో శుక్రవారం దేశతల్లిగుడి ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. దేశతల్లి గుడి ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అమ్మవారి గుడి నుంచి ఊరేగింపుగా దేశతల్లి గుడి ప్రతిష్ట కార్యక్రమానికి తరలి వెళ్లారు. అనంతరం దేశ తల్లి గుడి ప్రతిష్ట కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కోట భరత్ కుమార్ (సుమన్), జి.సత్యనారాయణ, భానుమూర్తి, వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని చిన్నగుడబ, పెదగుడబలో శుక్రవారం స్థానిక ఎస్ఐ అమ్మన్నరావు ఆధ్వర్యంలో పోలీస్ కవాతు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని ఎస్ఐ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వ హించేందుకు ప్రజలు సహక రించాలని కోరారు. అదే విధంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు.

చిన్నగుడబలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నియోజకవర్గానికి టిడిపి చేసిందేమిటి? : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

చంద్రబాబు నాయుడు సిఎంగా రాష్ట్రాన్ని పాలించిన సమయంలో గానీ, 2014 నుంచి 2019 వరకు గానీ టిడిపి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు ఏమిటో చెప్పాలని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర సవాల్ చేశారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో రూ.1200 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని ప్రగతిలో ఉన్నాయని చెప్పారు. ఏజెన్సీ గ్రామాల్లో చాలా వరకు రోడ్లు వంతెనల నిర్మాణానికి తానే కృషి చేశానని చెప్పారు. ఇన్ని అభివృద్ధి పనులు తాను చేస్తే ఏమీ చేయలేదని టిడిపి నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరేళ్ళ ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో చూపిస్తే ప్రజలు హర్షిస్తారని అన్నారు. తాను ఇంతవరకు అనేక సార్లు అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ చేసినా టిడిపి నాయకులు ముందుకు రాలేదని చెప్పారు. వారు చేసిన ఘనకార్యాలు ఏమిటో మీడియా ప్రతినిధులకైనా ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో ప్రభుత్వం ద్వారా వివిధ సంక్షేమ పథకాల రూపంలో రూ.1600 కోట్ల మేరకు ప్రజలకు ఆర్థిక లబ్ధి చేకూరిందని చెప్పారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా పేదరికమే అర్హతగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ప్రభుత్వం తమదేనని అన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని వద్దనుకుంటే ప్రజలే నష్టపోతారని అన్నారు. గతంలో మోసం చేసిన పార్టీలే ఇప్పుడు పొత్తులతో కూటమి పేరుతో ప్రజల ముందుకు వస్తున్నారని చెప్పారు. మోసం చేసిన పార్టీ నాయకులు కావాలో మేలు చేసిన ప్రభుత్వం కావాలో ప్రజలే తేల్చుకోవాలని రాజన్నదొర కోరారు.

పట్టణంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్

ప్రజా సంక్షేమానికి మద్దతు ఇవ్వండి

ఎన్నికల ప్రచారంలో ఎమ్‌పి బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమానికి మద్దతు ఇవ్వాలని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. పట్టణంలోని 19వ వార్డులో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వారు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి సిఎం జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. ప్రచారంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ చైర్మన్ చెలికాని మురళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనకు మద్దతుగా సినీనటుడు పృథ్వీరాజ్ ప్రచారం

ప్రజాశక్తి - వీరఘట్టం

పాలకొండ నియోజకవర్గ జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు మద్దతుగా జనసేన స్టార్ క్యాంపెనర్, సినీనటుడు పృథ్వీరాజ్ శుక్రవారం వీరఘట్టం మండల కేంద్రంలో ప్రచారం చేశారు. స్వామి థియేటర్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు పాదయాత్ర చేస్తూ ప్రజలకు అభివాదం చేస్తూ అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు గాజుగ్లాసు గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి బిపినాయుడు, నాయకులు ఎం.పుండరీకం, జనసేన జానీ, టిడిపి నాయకులు పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, తెలుగు యువత మాచర్ల అనిల్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : ఈ సార్వత్రిక ఎన్నికల్లో కూటమిదే విజయమని, పాలకొండలో జనసేన అభ్యర్థి జయకృష్ణ అఖండ మెజారిటీతో గెలిచి అసెంబ్లీలో

వీరఘట్టంలో ర్యాలీలో పాల్గొన్న సినీనటుడు పృథ్వీరాజ్

అడుగుపెడతారని సినీనటుడు పృథ్వీరాజ్ అన్నారు. శుక్రవారం పాలకొండలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కూటమిదే విజయమని, జగన్మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి లేదని, పాలకొండ నియోజకవర్గంలో రోడ్డులు పరమ అధ్వాహ్నంగా ఉన్నాయని విమర్శించారు. ఇంతటి దుర్మార్గపు పాలన ఎక్కడా లేదని, ఈ ప్రభుత్వానికి చరమ గీతం పాడాలని అన్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ కూటమి విజయం ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు గర్భాన సత్తిబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని దేవనపురం ,వేంపలగూడ,రేగుల గూడ,పాత ఈతమను గూడ,కొత్త గూడ,ఇప్పగూడ,ముకుందాపురం, కల్లం గూడ,అనపకాయలు గూడ, పులిపుట్టి గ్రామాల్లో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటు అనే ఆయుధంతో గాజు గ్లాస్ పై ఓటు వేసి అభివృద్ధికి నాంది పలుకుతారని ఈ సందర్భంగా ప్రజానీకానికి అభ్యర్థించారు. కార్యక్రమంలో సీతంపేట మండల పార్టీ అధ్యక్షులు సవర తోట మొఖలింగం,స్థానిక నాయకులు ఉమ్మడి పార్టీల నాయకులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బేబినాయన సమక్షంలో టిడిపిలో చేరిన జగన్నాధవలస గ్రామస్తులు

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని గోపాలవలస, జగన్నాధవలస, టెక్కలి వలస, పెరుమాలి, మోదుగువలస గ్రామాల్లో శుక్రవారం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల నాయకులు బుల్లి సూర్యనారాయణ, బారిక గణపతి, మామిడి రాంబాబు ఆధ్వర్యంలో సుమారు 350 కుటుంబాలు జగన్నాధవలస మామిడి రాంబాబు ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు పార్టీలో చేరాయి. వీరందరికీ బేబీ నాయన కండువాలేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకటనాయుడు, నాయకులు వెంకటేష్, ఆనందరావు, అప్పల నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పోలీసు పరిశీలకులుగా మన్సూరి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పార్లమెంటరీ నియోజకవర్గ పోలీసు పరిశీలకులుగా నయీం ముస్తఫా మన్సూరీని ఎన్నికల సంఘం నియమించింది. గురువారం జిల్లాకు ఆయన చేరుకున్నారు. పోలీస్ అతిథి గృహం సూట్ నెంబర్ 2 లో బస చేస్తున్నారు. పోలీసు పరిశీలకుల ఫోన్ నంబరు 75698 20106 కాగా పరిశీలకుల సమన్వయ అధికారిగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎల్ అశోక్ కుమార్ (9182361384) వ్యవహరిస్తున్నారు. ఎన్నికలలో శాంతి భద్రతల సంబంధిత అంశాలపై అరకు పార్లమెంటు నియోజక వర్గం పరిధిలో గల ఏడు శాసన సభ నియోజక వర్గాలకు సంబంధించి సమాచారం, ఫిర్యాదులు సమర్పించవచ్చని శుక్రవారం ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు.

ఎన్నికల సాధారణ పరిశీలకులుగా ప్రమోద్ కుమార్

పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులుగా ప్రమోద్ కుమార్ మెహర్ద ను ఎన్నికల సంఘం నియమించింది. గురువారం జిల్లాకు చేరుకున్నారు. పోలీస్ అతిథి గృహం సూట్ నెంబర్ 1 లో బస చేస్తున్నారు. పరిశీలకుల ఫోన్ నంబరు 7569898830 కాగా పరిశీలకుల సమన్వయ అధికారిగా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం డి నాయక్ (9494427718) వ్యవహరిస్తున్నారు. ఎన్నికల సంబంధిత అంశాలపై సమాచారం, ఫిర్యాదులు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.

రోడ్డుపై వ్యర్థాల డంపింగ్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో రెండో వార్డు పరిధిలో గల ముద్దు వారి వీధి కూడలి వద్ద నివాస గృహాల చెత్తలను, వ్యర్థాలను రహదారిపైనే డంపింగ్ చేయడంతో ఆ వ్యర్థాలను కుక్కలు, పందులు, పశువులు చిందర వందర చేయడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆ రహదారి గుండా రాకపోకలు సాగించే 28,29,30,1 వార్డులకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల స్థానికులు చెత్త, వ్యర్థాలను వేసేందుకు ఏర్పాటు చేసిన కాంపెక్టర్ బిన్‌ను ఈ ప్రాంతం నుండి వేరొక చోటికి తరలించడంలో ఆంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వేరే ప్రాంతానికి తరలించిన కాంపెక్టర్ బిన్ ను ఈ కూడలి వద్దనే ఏర్పాటు చేసి రహదారిపైనే వ్యర్థాలు వేయకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

రోడ్డుపై ఉన్న చెత్తాచెదారం

ప్రజాశక్తి 7
శనివారం 27 ఏప్రిల్ 2024

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమెప్పుడో?

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లా కేంద్రంగా విలసిల్లుతున్న పార్వతీపురం పట్టణం నిత్యం ట్రాఫిక్ సమస్యతో విలవిలలాడుతుంది. సుమారు 22ఏళ్ల క్రితం డివిజన్ కేంద్రంగా ఉన్న పట్టణంలోని ప్రధాన రహదారిపై జరిగిన రోడ్ల విస్తరణ తర్వాత, అనూహ్యంగా పట్టణం బెలగాం వరకూ వాణిజ్య పరంగా ఎంతగానో అభివృద్ధి చెందింది. మెయినరోడ్‌కు అనుకొని బంగారం, రడీమేడ్, ఫర్నిచర్ వంటి వాణిజ్య సముదాయాలు వెలియడంతో పాటు, ద్విచక్రవాహనాలు వాడకం అధికం కావడంతో దాదాపు నాలుగు కిలోమీటర్ల రహదారి ట్రాఫిక్ సమస్యతో బాధపడుతుంది. ఇప్పుడు మన్యం జిల్లా కేంద్రం కావడంతో రహదారి సమస్య మరింత జఠిలంగా మారింది. గత టిడిపి ప్రభుత్వంలో ఈ సమస్య పరిష్కారానికి పట్టణం చుట్టూ ఔటర్ రింగ్‌రోడ్

పట్టణంలో ప్రధాన రహదారిపై ప్రతిరోజూ స్తంభించిన ట్రాఫిక్

రూ.33కోట్లతో ప్రతిపాదనలు జరిగినప్పటికీ ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం ప్రతిపాదన బుట్టదాఖలు చేసింది. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే గానీ, ఎంపి గొడ్డేటి మాధవి గాని ఏనాడు చట్టసభల్లో ప్రస్తావించిన దాఖాలాల్లేవు. జిల్లా ఏర్పాటు తర్వాత పట్టణంలో రహదారులు, ఉద్యానవనాలు, పార్కింగ్ స్థలాలు, ఇతర సౌకర్యాలు పూర్తిస్థాయిలో జనాభాకు అనుగుణంగా కల్పించాల్సి ఉంది. కానీ జిల్లా ఏర్పడి రెండేళ్లు దాటినా ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. పట్టణానికి ప్రతిరోజు 15 మండలాల ప్రజలతో పాటు, అంతర్‌రాష్ట్రాలైన ఒడిషా, చత్తీష్‌గడ్‌ల నుండి చిన్న, పెద్ద వాహనాలు మెయిన్‌రోడ్‌పైనే రాకపోకలు సాగిస్తున్నాయి. దీనికి తోడు స్థానిక పోలీసులు పటిష్టమైన ట్రాఫిక్ నియంత్రణను గాలికి వదిలివేశారు. కనీసం పార్కింగ్ స్థలాల ఏర్పాటుపై కనీసం దృష్టి పెట్టలేదు. ఆర్‌టిసి కూడలి, సౌందర్య థియేటర్, సారికవీధి, నాలుగురోడ్ల కూడలి, పాతబస్టాండ్ ప్రాంతాల్లో ప్రజలు ట్రాఫిక్ రద్దీతో కుస్తీలు పడుతున్నారు. పట్టణ జనాభా అధికారికంగా 62వేలు అని చెపుతున్నప్పటికీ కొత్తగా విస్తరించిన కాలనీలతో జనాభా అనధికారికంగా లక్షకు పైగానే ఉంది. వేలకొలది ద్విచక్ర వాహనాల వాడకం పెరగడం, దానికి తగ్గట్టుగా వాణిజ్య సముదాయాల ముందు పార్కింగ్ స్థలాల్లేకపోవడంతో వాహనాలన్నీ ప్రధాన రహదారిపైనే పార్కింగ్ చేసే పరిస్థితి. గతంలో ప్రతిపాదించిన ఔటర్‌రింగ్‌రోడ్డు ప్రతిపాదనలకు పట్టాలెక్కించి, జిల్లా కేంద్రానికి అనుగుణంగా రహదారి నిర్వహణ, పార్కింగ్ స్థలాలు, ఉద్యాన వనాలు ఏర్పాటు చేసి పట్టణానికి పట్టి పీడిస్తున్న దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని గొట్టివలసలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను గ్రామపంచాయతీ కార్యదర్శి తిరుపతి భాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు పంచాయతీ పరిధిలోని చవకబందలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించిన అనంతరం వేతన దారులకు సంబంధించిన మస్తర్లను పరిశీలించారు. అదేవిధంగా ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువ ఉన్న నేపథ్యంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న వేతనదారులు జాగ్రత్తలు తీసు కోవాలని పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు సూచించారు. అలాగే ఉపాధిహామీ అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేపడితే వేతనం గిట్టుబాటు అవుతుందని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఉపాధి హామీ క్షేత్రసహాయకులు నల్ల సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు

ప్రజాశక్తి - కొమరాడ

డ్రైడే పాటించి జ్వరాలు, వ్యాధులు ప్రబలకుండా అదుపులో ఉంచవచ్చని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. మండలంలోని అర్తాంలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్నిశుక్రవారం ఆయన పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు పరిశీంచి, దోమల లార్వా గుర్తించిన వాటిని పారబోయించారు. వారానికి ఒకసారైనా శుభ్రం చేయాలని, ఇంటి పరిసరాల్లో, కాల్వల్లో చెత్తాచెదారం వేయరాదని, నీరు ఎక్కువ కాలం నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. డ్రైడే వివరాలు విసిహెచ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను తనిఖీ చేసి జ్వర లక్షణాలున్న వారికి నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. ఒఆర్‌ఎస్ ప్యాకెట్ల లభ్యతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, పిహెచ్‌ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది రామకష్ణ, శ్రావణి, నరేంద్ర, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిల్ల ఉన్న నీటిని పరిశీలిస్తున్న డిఎంఒ జగన్మోహనరావు

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

వేసవిలో తాగునీటి కోసం ప్రజలు ఎవరూ ఇబ్బందులు పడకుండా చూడాలని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి తాగునీటి కోసం ప్రజలెవరూ ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. కురుకుట్టి ఎంపిటిసి గెమ్మెల సుబ్బారావు మాట్లాడుతూ తమ పంచాయతీలోని జాకరవలసకు గత రెండేళ్లుగా మోటార్లు పనిచేయక తాగునీరు లేక ప్రజలు సువర్ణముఖి నది నుంచి నీరు తెచ్చుకొని తాగుతున్నారని, కలుషితమైన ఈ నీరుతాగి రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని, ఇకనైనా ఆ గ్రామానికి మోటార్లు బాగు చేసి తక్షణమే తాగునీరు ఇవ్వాల్సిందిగా కోరారు. దీనికి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ ఈ పంచాయతీకి రూ.72 లక్షలు మంచి నీటి కోసం మంజూరై ఉన్నాయని, ఎన్నికల నేపథ్యంలో వాటిని ఉపయోగించడానికి వీలు లేకుండా ఉందని తెలిపారు. ఈ విషయంపై కల్పించుకున్న ఎంపిడిఒ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అక్కడ పనులు మందగించినా తక్షణమే వాటర్ ట్యాంకులతో నీటిని గ్రామాలకు సప్లై చేయాలని సూచించారు. ఎపిఒ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనిని చేయిస్తున్నామని తెలిపారు. ఈ విషయంపై నార్లవలస ఎంపిటిసి అనూష మాట్లాడుతూ నార్లవలస పంచాయతీకి సంబంధించి ఉపాధి పనులు చేయడంలేదన్నారు. దీనికి ఎపిఒ సమాధానమిస్తూ కొన్ని గ్రామాల్లో కూలీలు అందుబాటులో లేరని, బయట పనులకు వెళ్లిపోయారని తక్షణమే ఎవరు ఉన్నా వారికి పని కల్పిస్తామని తెలిపారు. ఉపాధి హామీ పని ప్రదేశంలో టెంట్లు, మంచి నీరు, మజ్జిగ అందుబాటులో ఉండాలని, 60ఏళ్లు దాటిన వారికి పనులకు పెట్టుకో వద్దని వైస్ ఎంపిపి అన్నారు. తోణాం పిహెచ్‌సి వైద్యులు అనిల్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ప్రతి గ్రామంలో ఫ్యాగింగ్ చేయించాలని, ఇప్పటికే కొన్ని గ్రామాల్లో మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయని, దీనికోసం స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు తక్షణమే కల్పించుకొని ఆ గ్రామాల్లో ఫాగింగ్ నిర్వహించి పారిశుధ్య పనులు కూడా చేయిస్తామని ఎంపిడిఒ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి జి.రాములమ్మ, పలువురు అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి సురేష్

అధికారుల గైర్హాజరుతో సాదాసీదాగా ముగిసిన మండల సమావేశం

సీతానగరం : అధికారుల గైర్హాజరుతో మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.రమణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు హాజరుకాకపోవడంతో ఎటువంటి అంశాలను చర్చించకుండానే సమావేశాన్ని ముగించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జి.ఈశ్వరరావు, జడ్పిటిసి ఎం.బాబ్జీ, వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

రూ.200 కోట్ల టర్నోవర్‌తో యూనియన్ బ్యాంక్

ప్రజాశక్తి - సాలూరు

77 ఏళ్ల యూనియన్ బ్యాంక్ రూ.200కోట్ల టర్నోవర్‌తో కార్యకలాపాలు సాగిస్తోందని బ్యాంక్ రీజినల్ హెడ్ ఎం.వెంకట తిలక్ చెప్పారు. పట్టణంలోని ఆధునీకరించిన బ్యాంక్ శాఖను ఆయన శుక్రవారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు పూర్తి స్థాయిలో డిజిటల్ సేవలందిస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం రీజియన్ పరిధిలో ఉన్న 56 శాఖల్లో రూ.7,500 కోట్ల వ్యాపారం జరుగుతోందని చెప్పారు. ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలందించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ వేముల సత్యనారాయణ పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

5లోగా వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-పాలకొండ

నగరపంచాయతీలో కాంట్రాక్టు, మున్సిపల్ కార్మికులకు జనవరిలో ప్రభుత్వం ప్రకటించిన వేయి రూపాయలు నేటికీ విడుదల చేయలేదని, అలాగే మార్చి నెల నుండి పెంచిన జీతం రూ.21000కు గాను పాత జీతమే ఇచ్చి పెంపుదలను పెండింగులో ఉంచారని ఇది తగదని, ఫిబ్రవరి, మార్చి వేతన బకాయిలతో పాటు ఏప్రిల్ నెల రెగ్యులర్ వేతనాలు మే 5లోగా చెల్లించాలని కమిషనర్ సర్వేశ్వరరావుకు సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ఆధ్వర్యంలో కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం ఇచ్చారు. అదే విధంగా కార్మికులకు యూనిఫాం, కుట్టుకూలీ జనవరి నుండి ఇవ్వాలని, కార్మికులకు పుష్ కార్టులు, చీపుర్లు, పనిముట్లు కూడా వెంటనే సరఫరా చేయాలని కోరారు. లేని పక్షంలో మే 5 తర్వాత నిరవధిక సమ్మె చేస్తామని, ఇందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సురేష్, సిహెచ్ సంజీవి, పడాల వేణు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళా కార్యనిర్వాహక కార్యదర్శిగా పద్మావతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర తెలుగు మహిళ కార్యనిర్వహక కార్యదర్శిగా గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన బిడ్డిక పద్మావతిని రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు నియమించారు. తనపై నమ్మకం ఉంచి పదవీబాధ్యతలు అప్పగించినందుకు అభినందనలు తెలిపారు. కురుపాంలో ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి గెలుపు కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

ఎట్టకేలకు బోరుకు మరమ్మతులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎట్టకేలకు పట్టణంలోని 13వ వార్డులో గల ఇందిరా కాలనీలో బోరు బాగైంది. ఈ బోరుకు మరమ్మతులు చేయండంటూ ఈనెల 24న 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు సిబ్బందిచే శుక్రవారం బోరు మరమ్మతులు చేయించి, వాడుకలోకి తీసుకొచ్చారు. దీంతో ఆ వార్డులో గల కౌన్సిల్ సభ్యులు వండాన కృపాబాయితో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్ వర్క్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వేసవి సెలవుల్లో విద్యాశాఖ సూచించిన అంశాలను, ఆన్లైన్ పనులను సిఆర్‌ఎంటిలు పూర్తి చేయాలని ఎంఇఒ-1 సామల సింహాచలం అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో సిఆర్‌ఎంటిలతో సమావేశం నిర్వహించారు. వేసవి సెలవుల్లో విద్యాశాఖ సూచించే విద్యా సంబంధిత ఆన్‌లైన్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేసి ఆ సమాచారం కార్యాలయాలనికి అందజేయాలన్నారు. అలాగే పదో తరగతి ఫలితాలు బాగా రావడంలో సిఆర్‌ఎంటిలు కూడా ఆయా హెచ్‌ఎంల సమన్వయంతో కృషి చేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 కె.ప్రసాదరావు, సిఆర్‌ఎంటిలు, పిటిఐలు, ఆఫీస్ సిబ్బంది అప్పారావు, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదుల కోసం ఫోన్‌నంబర్లు ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్నికల ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ లో ల్యాండ్ లైన్ 08922-797120, 08922- 797124 నెంబర్ల ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. ఈ నెంబర్లకు ఫోన్ చేసి మోడల్ కోడ్ ఉల్లంఘన పై ఫిర్యాదులు చేయవచ్చని, ఎన్నికల సమాచారాన్ని పొందవచ్చని తెలిపారు. ఎన్నికల ఫిర్యాదులను ప్రజా యాప్ సి విజిల్ ద్వారా కూడా స్వీకరిస్తున్నామని, ఈ యాప్ కోసం ఆండ్రాయిడ్ ఫోన్ లో కెమెరా ఆప్షన్ ఉండాలని, ఫోటోలు, ఆడియో, వీడియోలను, మోడల్ కోడ్ ఉల్లంఘన లైవ్ రిపోర్టింగ్ ను ఈ యాప్ ద్వారా పంపవచ్చునని తెలిపారు. ముందుగా రికార్డ్ చేసిన ఫోటో లు, వీడియోలు ఈ యాప్ లో అనుమతించబడవని స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో క్షేత్ర స్థాయిలో విచారించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదు దారు వారి పేరు, ఫోన్ నెంబర్ రాయవచ్చునని, లేకపోయినా ఫిర్యాదును స్వీకరించి చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదుల కోసం 24/7 పని చేసే 1950 టోల్ ఫ్రీ నెంబర్ పని చేస్తోందని తెలిపారు.

ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు

ఎన్నికల పోలీస్ పరిశీలకులు సచీంద్ర పాటిల్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఎన్నికల నిర్వహణలో భాగంగా విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పోలీస్ బందోబస్తు వ్యవహారాల పర్యవేక్షణ కోసం ఎన్నికల కమిషన్ నియమించిన పోలీస్ పరిశీలకులు సచీంద్ర పాటిల్ జిల్లాకు చేరుకున్నారు. నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో వున్న పోలీస్ గెస్ట్ హౌస్ లో ఉదయం 10-30 నుంచి 11-30 గంటల వరకు ప్రజలకు అందుబాటులో వుంటారు. పోలీస్ పరిశీలకులను ప్రజలు నేరుగా కలసి గాని, మొబైల్ నెంబర్ ద్వారా కాని ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు. ప్రజలు పోలీస్ పరిశీలకుల మొబైల్ నెంబర్ 7075196069 నెంబర్ కు కుడా తమ ఫిర్యాదులు పంపవచ్చు. ఫిర్యాదు దారులు తమ పేరు, కాంటాక్ట్ నెంబర్, చిరునామా తెలుపుతూ ఫిర్యాదులకు వీడియో లు, ఫోటోలు, వాయిస్ మెసేజ్ లు, టెక్స్ట్ మెసేజ్ లు వంటి తగు ఆధారాలు కుడా జత చేయాల్సి వుంటుంది.

28, 30న సీనియర్స్, అండర్ -19 క్రికెట్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న (ఆదివారం) సీనియర్స్ విభాగంలో పురుషుల క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వారి ఒరిజనల్ ఆధార్, జన్మదిన ధ్రువపత్రాలు తీసుకొని హాజరు కావాలన్నారు.

30న అండర్ -19 ఎంపిక పోటీలు

ఈనెల 30న అండర్ -19 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఎంఎల్ఎన్ రాజు తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2005 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. పోటీలకు హాజరయ్యే వారు ఒరిజినల్ ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువపత్రం, గత మూడేళ్ళ స్టడీ సర్టిఫికెట్స్ తీసుకొని రావాలన్నారు. సంబంధిత తేదీల్లో ఉదయం 6.30 గంటలకు వైట్ డ్రెస్, సొంత కిట్ తో హాజరు కావాలని కోరారు.

సీతం కళాశాలలో కార్యశాల

ప్రజాశక్తి-విజయనగరం

స్వామిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'మేధో సంపత్తి హక్కులు, స్టార్టప్‌ల' కోసం మేధో సంపత్తి మేనేజ్‌మెంట్' అనే అంశంపై ఒక రోజు శిక్షణ జరిగింది. నవల పేటెంట్ సర్వీసెస్ చీఫ్ రిసోర్స్ పర్సన్ టెక్నికల్ మేనేజర్ జి.స్వామి మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కులు విద్యావేత్తలు, పరిశ్రమల మధ్య వారధిగా పనిచేస్తుందని అన్నారు. భారతదేశానికి మరిన్ని ఆవిష్కరణలు అవసరమని పేర్కొన్నారు. మేధో సంపత్తిని ప్రోత్సహించడం, రక్షించడం ఆవశ్యకతను వివరించారు. సీతం కాలేజ్ డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులంతా మేధో సంపత్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ డి.వి.రామమూర్తి మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత కోసం అపారమైన సామర్థ్యం ఉందని, విద్యార్థులను చైతన్యపరిచారు. పేటెంట్లను విజయవంతంగా ప్రచురించిన సిబ్బందిని అభినందించారు. హెచ్ఒడి ఎస్.వరూధిని మేధో సంపత్తి హక్కులు, పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు ప్రాపర్టీలను ఎలా రక్షిస్తాయో అవగాహన కల్పించారు. పేటెంట్ ప్రచురణకర్తలందరికీ సీతం యాజమాన్యం 1000 రూపాయల విలువ గల చెక్కులను అందించింది. కార్యక్రమంలో డీన్ నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.6కోట్ల విలువైన బంగారం పట్టివేత

ప్రజాశక్తి డెంకాడ /భోగాపురం

మండలంలోని మోదవలస ఎన్నికల చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా వ్యాన్ లో తరలిస్తున్న సుమారు 6 కోట్ల విలువైన 10 కేజీల బంగారాన్ని పోలీసులు శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాన్ని డెంకాడ పోలీస్ స్టేషన్ కు తరలించారు. తరలిస్తున్న బంగారానికి సంబంధించి ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. 10 కేజీల బంగారానికి ఆరు కోట్ల రూపాయలు బిల్లులు ఉన్నప్పటికీ దానికి తగ్గట్టు బంగారం తీసుకువెళ్తున్నారా లేదా ఇంకా ఎక్కువ బంగారాన్ని తీసుకువెళ్తున్నారా అనే దానిపై పోలీసులు విచారిస్తున్నారు. దీనిపై పూర్తి వివరాలు కోసం సిఐ వెంకటేశ్వరరావు, ఎస్. ఐ కష్ణమూర్తి పరిశీలిస్తున్నారు. విశాఖపట్నం నుంచి విజయనగరంలోని ఆర్డర్లపై బంగారం షాపులకు అందజేసేందుకు ఈవ్యాన్ లో తరలిస్తున్నట్లు సమాచారం. కానీ ఎన్నికల నియమావళి ప్రకారం ఇంత పెద్ద ఎత్తున బంగారం తరలిస్తున్నప్పుడు అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

మోదవలస చెక్‌పోస్టు వద్ద బంగారాన్ని పట్టుకున్న పోలీసులు

కారులో తరలిస్తున్న లక్ష రూపాయల నగదు పట్టివేత

పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో లక్ష రూపాయలు నగదు పట్టుబడింది. భోగాపురం లోని ఆంజనేయస్వామి జంక్షన్ వద్ద ఎస్ఐ సూర్య కుమారి సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టారు. పూసపాటిరేగ మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన మహాదాసు ఆదినారాయణ కారులో వస్తుండగా ఆపి తనిఖీ చేయగా లక్ష రూపాయలు నగదు దొరికింది. ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల కమిటీకి అప్పగిస్తామని సిఐ రవికుమార్ తెలిపారు.

పోలీసుల తనిఖీల్లో భాగంగా పట్టుబడి నగదు

హక్కులను కాలరాస్తున్న పాలకులు

సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్స

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

గత పదేళ్లగా అధికారంలో ఉన్న పాలకులు కార్మిక, కర్షక, గిరిజన, దళిత వర్గాలకు వ్యతిరేకంగా పాలన సాగిస్తూ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స అన్నారు. ఈనేపథ్యంలో మతతత్వ బిజెపిని ఓడించి అణగారిన వర్గాలను ఏకం చేసి వారి తరపున నినదించే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. శుక్రవారం పార్వతీపురం మండలం బందలుప్పి, పులుగుమ్మి, జమ్మిడివలస గ్రామాలలో సీనియర్ సిపిఎం నాయకులు ఎం.కృష్ణమూర్తితో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అటవీ హక్కుల చట్టాన్ని నీరుగార్చి అడవులను కార్పోరేట్ కంపెనీలకు కట్టబెట్టాడానికి ప్రయత్నిస్తోందని అన్నారు. చట్టాలను మారుస్తూ జీవో నెంబర్ 3 ద్వారా దక్కాల్సిన ఉద్యోగాలను దక్కకుండా చేసి గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఉపాధి లేక గిరిజన యువత వలసలు పోతున్నారని, గిరిజన గ్రామాలలో వైద్యం అందని ద్రాక్షగా మారిందని అన్నారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు గిరిజన భూములను అదానీకి హైడ్రో ఎలక్ట్రిసిటీ విద్యుత్ ప్రాజెక్టుల కోసం కట్టబెడుతున్నారని అన్నారు. హక్కుల సాధన గిరిజన ప్రాంతాన్ని రక్షించుకునేందుకు సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అభ్యర్థి అప్పలనర్స, సిపిఎం నాయకులు కృష్ణమూర్తి

ముద్దాడ రమణికి కండువా వేసి టిడిపిలోకి ఆహ్వానిస్తున్న అదితి విజయలక్ష్మి

టిడిపిలో చేరిన ముద్దాడ మధు

ప్రజాశక్తి-విజయనగరంకోట

వైసిపికి చెందిన మున్సిపల్ కో- ఆప్షన్ సభ్యురాలు ముద్దాడ రమణీ, పార్లమెంట్ మాజీ కార్యదర్శి మధు శుక్రవారం టిడిపిలో చేరారు. అశోక్‌బంగ్లాలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు, పార్లమెంట్ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు సమక్షంలో వారు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర అభివద్ధి పురోగతిలోకి తీసుకువెళ్లాలంటే చంద్రబాబు సిఎం కావాలని అన్నారు. ఉమ్మడి పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో మూతబడిన అన్న క్యాంటీన్లను తెరుస్తామని తెలిపారు. చంద్రన్న భీమా రూ.10 లక్షల వరకు చేస్తామన్నారు. ముద్దాడ మధు మాట్లాడుతూ అశోక్‌గజపతిరాజు ఆదేశాలతో అదితి నాయకత్వంలో పనిచేయాలని పార్టీలో చేరినట్లు తెలిపారు. నా బీసీలు అని చెప్పుకునే జగన్ ఒక్కరికి కూడా స్వయం ఉపాధి రుణాలు ఇవ్వలేదన్నారు. ఉత్తరాంధ్రను అసలు పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో బిసిలుగా ఉన్న యాదవులకు ఒక సీటు కూడా కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగ్ రావు, పిల్లా విజయ్ కుమార్ , అవనాపు విజయ్ , కాళ్ల గౌరీ శంకర్ , చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. 25వ డివిజన్ మంగళ వీధికి చెందిన పతివాడ శంకరరావు, పతివాడ రమణ, కోన సాయి లక్ష్మి, పతివాడ మీనా, కొల్లి ఎల్లారావుతో పాటు 10 కుటుంబాలు టిడిపిలో చేరాయి.

సార్వత్రిక విద్యాపీఠం ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం పదో తరగతి, ఇంటర్ 2024 పబ్లిక్ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. పదో తరగతి ఉత్తీర్ణతా శాతంలో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలో ఆరో స్థానంలో, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతా శాతంలో 12వ స్థానంలో నిలిచింది. పదో తరగతి 680 మంది పరీక్షకు హాజరు కాగా, 531 ఉత్తీర్ణులై 78.09శాతం ఫలితాలు, ఇంటర్మీడియట్ 465 హాజరుకు గానూ, 291 మంది ఉత్తీర్ణులై 62.58శాతం ఫలితాలు నమోదయ్యాయి. పరీక్ష తప్పిన వారి కోసం, సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1నుంచి 8 వరకు జరుగుతాయి. ఈ పరీక్షలకు హాజరగు విద్యార్థులు ఈనెల 29నుంచి మే 4 లోగా పరీక్షా ఫీజును ఎపి ఆన్‌లైన్ ద్వారా మే 5 లోగాచెల్లించాలి. పదో థియరీ ఒక సబ్జెక్ట్ కు రూ.100, ఇంటర్ థియరీ ఒక సబ్జెక్ట్‌కు రూ.150, ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ ఒక సబ్జెక్ట్‌కు రూ.100, పదో తరగతి, ఇంటర్ రీ కౌంటింగ్ కు రూ.200, పరిశీలనకు రూ.1000 ఈనెల 29 నుంచి మే 5 వరకు దీన్ని ఎపిటి ఆన్‌లైన్‌లో చెల్లించాలి. వివరాలను www.apopenschool.ap.gov.in website తెలుసుకోవచ్చునని, మరియు సంబందిత A.l Co-ordinators ఫలితాలను విద్యార్థులకు తెలియచేయవలెనని డిఇఒ కార్యాలయం పేర్కొంది.

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి-గుర్ల

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మండలం లోని పాలవలస, గూడెం, తెట్టంగి, కొండగండ్రేడు గ్రామాల్లో శుక్రవారం ఎస్ఐ ఎస్.భాస్కర రావు ఆధ్వర్యంలో సివిల్, ఆర్‌పిఎఫ్ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రశాంతాయుతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని, ప్రతీ ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ప్రజలను కోరారు.